ప్రజాశక్తి

గురువారం 13 మార్చి 2025

5

పార్వతీపురం మన్యం

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కురుపాం

ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 17 నుంచి మే 22 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశానికి ఆన్లైన్ ద్వారా MPC/BiPC/MEC/CEC (గ్రూపులు) కావలసిన విద్యార్థులు http://cse.ap.gov.in, http://apms.apcfss.in వెబ్సైట్లో అప్లై చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీలకు రూ.150, ఒసి, బిసి, ఇడబ్ల్యుఎస్లకు రూ.250 దరఖాస్తులు రుసుం చెల్లించాలని, 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీటు ఇవ్వబడుతుందని, కావున అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

'స్వచ్ఛ సమాజం ఏర్పాటు చేద్దాం'

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పారిశుధ్యాన్ని పాటించి స్వచ్ఛ సమాజాన్ని ఏర్పాటు చేద్దామని కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ స్వచ్ఛ సుందర పార్వతీపురం, పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం దుష్ప్రభావాల నినాదాలతో సాగింది. ఆర్టీసి వద్ద జరిగిన సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్యం ఆవశ్యకతను వివరించారు. పారిశుధ్యంతో ఆరోగ్యం ముడిపడి ఉందని ఆయన పేర్కొన్నారు. మంచి సమాజానికి పారిశుధ్యం తప్పనిసరని తద్వారా మంచి ఆరోగ్యం రావడం కాకుండా ఉత్పాదక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, దేశంలోనే పార్వతీపురం మన్యం జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలపాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటు చేసుకోవడం పర్యావరణానికి మంచిదని ఆయన చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల జీవరాశుల మనుగడకు ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ స్వచ్ఛ సమాజం సమాచారం ప్రతి ఒక్కరికీ చేరాలన్నారు. పార్వతీపురం, సాలూరులో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు మంజూరు అయ్యాయని అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున రావు మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. పారిశుధ్యంపై సామాజిక స్పృహ రావాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్డి కలిగి ఉండాలని ఆయన కోరారు. సంతలు వంటి ఎక్కువ మంది గుమిగూడే ప్రదేశాలలో సామాజిక మరుగుదొడ్డి ఏర్పాటు చేయడం జరుగుతుందని వాటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సుందర పార్వతీపురం ప్రతిజ్ఞ ను నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, డ్వామా పీడీ కె.రామ చంద్ర రావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, డిపిఒ టి.కొండలరావు, విజయనగరం, శ్రీకాకుళం జెడ్పీ డిప్యూటీ సిఇఒలు ఆర్వి రామన్, సత్యనారాయణ, డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా సహకార అధికారి పి శ్రీరామ మూర్తి, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా. టి కనకదుర్గ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి ఎస్ కృష్ణ వేణి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ భాస్కర రావు, స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ కన్సల్టెంట్ శ్రీనివాసన్, స్వచ్ఛ సుందర పార్వతీపురం ప్రతినిధి పద్మజ, పట్టణ ప్రముఖ వైద్యులు ద్వారపురెడ్డి రామ్మోహన్ రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బడే నాగభూషణరావు, ఘన, ద్రవ వనరుల నిర్వహణ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పాల్గొన్నారు..

స్వచ్ఛ సుందర పార్వతీపురం ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

అసంపూర్తి ఇళ్లనిర్మాణాలకు రూ.73.09 కోట్ల సాయం

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి ప్రభుత్వ చర్యలు చేపట్టిందని కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ సాకారంలో భాగంగా 2029 నాటికి అందరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా పీఎంఏవై 1.0లో ఇళ్లు మంజూరై, వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. బుధవారం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ దశల్లో నిర్మాణాలు ఆగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు చెందిన 10,717 గృహాలు పూర్తి చేసేందుకు మంచి అవకాశం అన్నారు. ఇందులో బిసి లబ్ధిదారులు 4109, ఎస్సీ లబ్ధిదారులు 1169, ఎస్టీ లబ్ధిదారులు 3073, ఎస్టీ (పీవీటీజీ) లబ్ధిదారులు 2366 మంది ఉన్నారని వివరించారు. జిల్లాలో లబ్ధిదారులకు రూ.73,09,75,000 అదనంగా ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఎస్సీలు, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పివిటిజి (ఆదివాసి గిరిజనులకు) లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అదనంగా అందిస్తుందని తెలిపారు. గృహ నిర్మాణాలను 2025 ఏప్రిల్ లోగా పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. దీనిపై సంబంధిత అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. గృహ నిర్మాణ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ, వార్డు ఎమినిటీస్ సహాయకులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా సమన్వయం చేయాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అలాగే సర్వేకు వచ్చిన సచివాలయ, గృహ నిర్మాణ సంస్థ సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సర్వే మార్చి 15 నుండి 22వ తేదీ వరకు జరుగుతుందని అన్నారు.

విలేకరుల సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి డా.పి.ధర్మ చంద్రా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంస్కరణలకు సలహాలు, సూచనలు ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్నికల ప్రక్రియ మరింత బలోపేతం చేయడానికి, కొత్త సంస్కరణలు తీసుకొచ్చే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం, గుర్తింపు పొందిన అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి అవసరమైన సలహాలు సూచనలు ఆహ్వానిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950, 1951 ఓటర్ల నమోదు నియమాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి వంటి అంశాలపై సలహాలు, సూచనలను ఈ నెల 31వ తేదీలోగా అందజేయాలని ఆయన సూచించారు. వచ్చిన సూచనలు, సలహాలపై భారత ఎన్నికల సంఘం ఏప్రిల్ 30న అన్నీ జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తారని ఆయన తెలిపారు.

నేడు కవయిత్రి మొల్లమాంబ జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

కవయిత్రి మొల్లమాంబ జయంతి రాష్ట్ర పండుగ్గా గురువారం నిర్వహించనున్నట్లు జిల్లా బిసి సంక్షేమ, సాధికారిత అధికారి ఎస్ కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన చెప్పారు. కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని జిల్లా కలక్టరు కార్యాలయసమావేశ మందిరంలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

లబ్ధిదారులందరికీ టిడ్కో ఇళ్లు

ఇళ్ల సముదాయం పరిశీలనలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణమైన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులందరికీ వెంటనే అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై చైతన్యయాత్రలో భాగంగా టిడ్కో గహ సముదాయాలను సిపిఎం బందం బుధవారం పరిశీలించింది. సాలూరు పట్టణంలో ఇళ్లు లేని పేదలందరికీ టిడ్కో ద్వారా 1248 ఇళ్లను ప్రభుత్వం నిర్మించినా ఈరోజు వరకు లబ్ధిదారులకు అందించకపోవడం దారుణమని అన్నారు. పేదల సమస్యలపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. 1248 మంది లబ్ధిదారులకు గృహాలు నిర్మించి వీటిలో 1056 ఇళ్ల పనులు పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వలేదని చెప్పారు. ఈ గృహాల సముదాయంలో పిచ్చిమొక్కలు వెలసి తుప్పలు పెరిగిపోతున్నాయని, దీనివల్ల భవిష్యత్తులో తలుపులు, కిటికీలకు చెదలు పట్టి పాడైపోయే అవకాశం ఎక్కువ ఉందని, కరెంటు, రోడ్లు, మంచినీటి సౌకర్యం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఇళ్ల స్థలాల్లేని వారి కోసం గుమ్మడ, నెలపర్తి ప్రాంతాల్లో కేటాయించిన స్థలాలకు కూడా మౌలిక వస్తువులైన కరెంటు, నీరు, రోడ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదని గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తుందని, ఇదే పరిస్థితి కొనసాగితే లబ్ధిదారులందర్నీ కలుపుకొని ఆందోళనకు సిద్ధపడతామని అన్నారు. దీనికి అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న అన్ని కాలనీలో కూడా మౌలిక వస్తువులు పెంచేందుకు సరిపడా నిధులు కేటాయించి రోడ్లు కరెంటు నీరు పార్కులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సాలూరు పట్టణ సిపిఎం కార్యదర్శి ఎన్వై నాయుడు, నాయకులు ఈశ్వరరావు, తనూజు, భాస్కరరావు, పాచిపెంటర్ సిపిఎం నాయకులు కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా కేసులపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం

సికిల్ సెల్ ఎనీమియా కేసులపై వైద్య అధికారులు స్వయంగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా కేసులు వివిధ కారణాలతో భవిష్యత్తులో ముందడుగు వేసేందుకు వెనుకంజ వేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పరంగా వారికి అనేక ప్రయోజనాలున్నాయని, వాటిని వారు పొంది మంచి ఆరోగ్యం, భవిష్యత్తు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గర్భిణుల నమోదులో జాప్యం జరగరాదన్నారు. అభా ఐడి వెంటనే వచ్చేలా చేయాలని పేర్కొన్నారు. మొండెంఖల్లు తదితర పిహెచ్‌సిల్లో శత శాతం ప్రసవాలు ఆసుపత్రిలో చేయడం పట్ల వైద్యాధికారులను కలెక్టర్ అభినందించారు. అసంక్రమిత వ్యాధుల సర్వే బాగా చేపట్టాలన్నారు. అందులో ఆర్ఆర్‌బి పురం వైద్యాధికారి బాగా చేయడం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. భద్రగిరి, సాలూరు, కురుపాం ఆసుపత్రుల అదనపు భవనాల పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాకు ఐదు అంబులెన్స్‌లు, ఒక సంచార ఎక్స్‌రే యూనిట్ వచ్చాయని వాటిని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న వైద్య ఆరోగ్య సేవలను వివరించారు. సమావేశంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ప్రభుత్వ భూములు ఆన్లైన్‌లో నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందని పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు.

రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

అలాగే తహశీల్దార్ పి.బాలను ప్రభుత్వ భూములు ఆన్‌లైన్, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తెలియజేసిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉందని అధికారులకు దిశ నిర్దేశం చేశారు. దల్లైవలసలో చేపడుతున్న రీసర్వేలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా అధికారులు చూసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్ ఎస్ జి ప్రసాద రావు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో వైసిపి నాయకులు చేపట్టిన భారీ ర్యాలీ

నమ్మించి మోసగించిన టిడిపి

యువత పోరులో వైసిపి నాయకులు

ప్రజాశక్తి- పార్వతీపురం

రాష్ట్రంలోని లక్షలాదిమంది విద్యార్థులు, యువకులను టిడిపి కూటమి ప్రభుత్వం నమ్మించి మోసగించిందని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. బుధవారం నిర్వహించిన యువత పోరులో భాగంగా డిఆర్ఒ కె.హేమలతకు రాజన్నదొర, మాజీ మంత్రి పుష్ప శ్రీవాణి, మాజీ ఎమ్మెల్యేలు జోగారావు, కళావతి వినతిపత్రం అందించారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ విద్యార్థులు, యువకుల ఆశలను కూటమి ప్రభుత్వం అడియాసలు చేసిందన్నారు. పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద నిధులు విడుదల చేయకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు భృతి మంజూరు చేస్తామని హామీ ఇచ్చి పది నెలలుగా ప్రభుత్వం మొండిచేయి చూపించిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి జాబ్ కేలండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి మోసంగించిదన్నారు. మాజీమంత్రి పుష్పశ్రీవాణి మాట్లాడుతూ వైసిపి హయాంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరు కాగా, వాటిలో ఐదు కాలేజీలను ప్రారంభించామని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మెడికల్ కాలేజీలను రద్దు చేయడం వేలాదిమంది యువకుల ఆశలను ఒమ్ము చేయడమేనన్నారు. మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో అన్ని వర్గాల ప్రజలనూ నిలువునా మోసం చేసిందన్నారు. అంతకు ముందు ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జిల్లా వైసిపి అధ్యక్షులు పరీక్షిత్తు రాజు, మాజీఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యాన ర్యాలీ ప్రారంభించి కలెక్టర్ కార్యాలయం వరకు సాగించారు. అయితే అన్న క్యాంటీన్ జంక్షన్ వద్ద పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. కలెక్టరేట్‌కు వెళ్ళకుండా బారికేడ్ వేశారు. పార్టీకి చెందిన ముఖ్య నాయకులను కలెక్టరేట్ లోపలికి అనుమతించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కళావతి, వైసిపి సీనియర్ నాయకులు డి.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాసరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా నియంత్రణకు చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - పాచిపెంట/సాలూరురూరల్

జిల్లాలో గంజాయి, మద్యం అక్రమరవాణా నియంత్రించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి ప్రొబేషనరీ ఎస్‌ఐలకు సూచించారు. బుధవారం ఆయన సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ప్రాక్టికల్ శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ ఎస్సైలకు నిర్వర్తించాల్సిన విధుల పట్ల దిశా నిర్దేశం చేశారు. తరుచూ గ్రామాలను సందర్శించాలని, ముఖ్యంగా ఏజెన్సీ (ఎక్ట్రిమిస్ట్ ప్రభావిత) ప్రాంతాలను సందర్శించాలని, అక్కడ ప్రజలతో సమావేశమై, వారితో మమేకమై వారికీ సైబర్, నక్సలిజమ్/ మత్తుపదార్ధాల/ నాటుసారా వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌పి కూంబింగ్ ఆపరేషన్ల గురించి తెలుసుకొని, నిర్వహించాలని, చుట్టూ పక్కల ఏజెన్సీ (ఎక్ట్రిమిస్ట్ ప్రభావిత) ప్రాంతాల్లో సంచరించే దళాల గురించి, వారికి సహాయం చేసేవారి వివరాలు, మునుపటిగా జరిగిన సంఘటనలు గూర్చి తెలుసుకోవాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సామరస్యంగా మెలగి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాఖబంది విధులు ఇతర స్టేషన్ విధుల గురించి క్షుణ్ణంగా ఈ ప్రాక్టికల్ శిక్షణలో నేర్చుకోవాలని తెలిపారు. అనంతరం పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో గల హైవే దగ్గర చిన్న చిన్న రహదారులు మాతుమూరు, అలూరు గ్రామాల రహదారుల గుండా ఒరిస్సా నుండి, ఇతర ప్రాంతాల నుండి ప్రయాణించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, అక్రమరవాణా (గంజాయి,మద్యం) నియంత్రించేందుకు గట్టి చర్యలు చేపట్టాలని అధికారులని జిల్లా ఎస్పీ గారు ఆదేశించారు. ఈ సందర్భనలో సాలూరు పట్టణ, రూరల్ సిఐలు బి.అప్పలనాయుడు, రామకృష్ణ, రూరల్ ఎస్సై నరసింహమూర్తి, పాచిపెంట ఎస్సై వెంకట సురేష్, ప్రొబేషనరీ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతుమూరు-ఆలూరు రహదారిపై గస్తీని పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

కో-ఆపరేటివ్ బ్యాంకులో దోపిడీకి యత్నం

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలో కోపరేటివ్ బ్యాంక్‌లో చోరీ యత్నం జరిగిందని పోలీసులు తెలిపారు. పోలీసులు ఇచ్చిన వివరాల మేరకు.. బ్యాంకులో పనిచేస్తున్న ఎటెండర్ బుధవారం ఉదయాన్నే డ్యూటీ సమయానికి వచ్చేసరికి తలుపులు పగలగొట్టి ఉండటంతో వెంటనే మేనేజర్ సూర్యనారాయణకు సమాచారం మిచ్చారు. మేనేజర్ పై అధికారులకు తెలియజేసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పార్వతీపురం రూరల్ సీఐ ఎస్ గోవిందరావు, ఇన్ఛార్జి ఎస్ఐ వై సింహాచలం, క్లూస్‌టీమ్ ఎస్‌క్యి తేజ స్వరూప్ ఆధ్వర్యంలో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీ, ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. చోరీకి ప్రయత్నించినప్పటికీ దుండగులు ఎటువంటి డబ్బులు, వస్తువులు గానీ తీసుకువెళ్లలేదని బ్యాంక్ సిబ్బంది తెలిపారు. దీంతో బ్యాంకు సిబ్బంది పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలు ఆధారంగా దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

బ్యాంకులో వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

మత్స్య సంపద అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య తెలిపారు. మత్స్య సంపద వృద్ధి చేయాలన్న సంకల్పంతో చేపల పెంపకంలో ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీస్, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, వందన వికాస కేంద్రాలతో భాగస్వామ్యం చేసి మత్స్య ఉత్పత్తి వృద్ధి చేయడానికి క్యాప్టింగ్ ఫిష్ సీడ్ రేరింగ్ యూనిట్స్" (చెరువులలో చెరువు) నిర్మించుకునే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్ఆర్ఇజిఎస్, నీటిపారుదల శాఖ, డిఆర్డిఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపల పెంపకంలో మత్స్యకారులను భాగస్వామ్యం చేసి తద్వారా మేలైన, నాణ్యమైన చేపపిల్లలు అధిక ఉత్పత్తి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మత్స్యకారుల్లో శాస్త్రీయ, సాంకేతిక అవగాహన పెరిగి వారి జీవన స్థితిగతులు పెంపొందించి జీవనోపాధి మరింత మెరుగుపడుతుందని తెలిపారు. జాతీయ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్ ఫాం (ఎన్‌ఎఫ్‌డిపి), శ్రమ్ పోర్టల్స్ లో ఫిషర్స్, ఫిష్ వెండర్స్, ఎంటర్ ప్రెన్యూర్స్, టేడర్స్, ఫిష్ వర్కర్స్, మత్స్యకారుల కోపరేటివ్ సొసైటీ సభ్యులు తప్పనిసరిగా వారి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా మిగులు నిధులతో 40శాతం సబ్సిడీతో రూ.10 లక్షల విలువైన మూడు కియోస్కోలు, రూ.20 లక్షల విలువైన లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్లు, రూ.50 లక్షల యూనిట్ల ఫిష్ రెస్టారెంట్స్, కోటి యూనిట్ల ఆక్వా హబ్, 20లక్షల నాలుగు చక్రాల లైవ్ ఫిష్ రవాణా, ఇన్సులేటెడ్ వాహనాలను నిరుద్యోగులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు డి.గోపీకష్ణ, శ్రీదేవి, జిల్లా మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, ఎన్‌జిఒ సభ్యులు, ఇరిగేషన్ జెఇ, ఎఇఇఎస్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలకు వెళ్లి అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేయాలి

పార్వతీపురం : ప్రతి గిరిజన గ్రామాలకు వెళ్లి అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఐటిడిఎ పిఒఅశుతోష్ శ్రీవాస్తవ జీసీసీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కార్యాలయంలో జిసిసి ద్వారా అందుతున్న కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులను ఎప్పటికప్పుడు కోల్డ్ స్టోరేజ్ గోడౌన్స్‌కు తరలించాలని చెప్పారు. ఇందులో ఎటువంటి అవకతవకలు పాల్పడితే, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గిరిజనులు పండించిన అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేసి వారికి ఆర్థికంగా చేయూతను అందించాలన్నారు.

కార్మిక సమస్యలు పట్టించుకోని పాలకవర్గం

ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్థానిక మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె బుధవారం మూడో రోజుకు చేరింది. పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని మున్సిపల్ యూనియన్ తీవ్రంగా పరిగణిస్తుందని కమిటీ వెల్లడించింది. మూడవరోజు సమ్మె చేస్తున్న కార్మికులను ఉద్దేశించి మున్సిపల్ యూనియన్ మహిళా కమిటీ కో- కన్వీనర్ జి.స్వప్న, తుపాకుల సీత మాట్లాడారు. మున్సిపాలిటీలోని ప్రజలకు పారిశుధ్యం, నీరు, కరెంటు సమయానికి అందిస్తున్న కార్మికుల ఆకలి బాధలు తీర్చేందుకు పాలకవర్గానికి చొరవ లేకపోవడం కార్మికులపై పాలకులకు ఎంత ప్రేమ ఉందో ఈ విషయమే తెలియజేస్తుందని విమర్శించారు. పని చేయించుకున్నప్పుడు చేసే వారికి జీతం ఇవ్వాల్సిన బాధ్యత యజమానికి ఉంటుందని, కనీసం మున్సిపల్ కార్మికులకు జీతాలు ప్రతినెలా ఇవ్వాలన్న ఆలోచన కూడా సాలూరు పాలకవర్గానికి గానీ, అధికారులకు గానీ, ప్రజా ప్రతినిధులకు గాని లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. కార్మిక సమస్యలు పరిష్కరించడంలో ఇదే వైఖరి కొనసాగితే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ సాలూరు కమిటీ అధ్యక్షులు టి .శంకర్రావు నాయకులు పోలరాజు, రవి, వెంకన్న ,హరి కార్మికులు పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు స్వప్న



విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందజేస్తున్న డివిజి శంకరరావు

విద్యార్థులకు పదో తరగతి కీలకం

ప్రజాశక్తి - కురుపాం

పదో తరగతి విద్యార్థులకు కీలకమని, కావున ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉత్తీర్ణత సాధించాలని ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు అన్నారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలంటే పదో తరగతి పునాది లాంటిదని, కావున కష్టపడి ఇష్టంతో చదవాలని, అలాంటప్పుడే ఉత్తీర్ణత సాధించగలమని అన్నారు. అలాగే పరీక్షల ముందు విద్యార్థులు అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు అందించారు. అనంతరం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎటిడబ్ల్యుఒ కె.చంద్రబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామగోవింద్, వార్డెన్ కె. సూర్యనారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేలో లోపాలు సరిదిద్దాలి

ప్రజాశక్తి - కొమరాడ

గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో లోపాలు వెంటనే సరిదిద్ది రైతులకు అన్ని విధాలా భరోసా కల్పించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడలో రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే చేసి అన్ని విధాలా రైతులకు భరోసా కల్పిస్తామని చెప్పినా ఎక్కడా ఆ లోపాలు సరిదిద్దలేదన్నారు. ఇప్పటికీ రీసర్వే చేసిన రైతుల భూములకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేని పరిస్థితి ఉందని తెలిపారు. ఒక రైతుకు రీసర్వేలో తక్కువ భూమి పడితే ఇంకొక రైతుకు రీసర్వేలో ఎక్కువ భూమి రికార్డులో పడే పరిస్థితి ఉందని అన్నారు. సర్వే చేసిన కొన్ని ప్రాంతాల్లో నేటికీ వన్ బి రాకపోవడంతో బ్యాంకులో రైతుల రుణాలు రెన్యువల్ కావడంలేదన్నారు. కావున వెంటనే కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో 'సంకల్పం'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని నాయుడు మల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సీతంపేట పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. మహిళా భద్రత గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ట్రైన్ ఎస్సైలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ పద్మావతి

ఏజెన్సీలో డిప్యూటీ డిఎంహెచ్ఒ పర్యటన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి సిహెచ్‌సి, తాడికొండ పిహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉప వైద్యాధికారిణి (డిప్యూటీ డిఎమ్ అండ్ హెచ్ఒ) పద్మావతి బుధవారం సందర్శించారు. మన్యంలో జ్వరాలు పలు పత్రికల్లో వచ్చిన వార్తలపై ఏజెన్సీలో ఆమె పర్యటించారు. తాడికొండలో జ్వర పీడితులతో మాట్లాడారు. వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. జ్వరాల తీవ్రత, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా మెరుగైన వైద్య సేవలందించే దిశగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలపై ఎంపిడిఒతో మాట్లాడారు. భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రోగులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రౌతు రవికుమార్, ఎం. బుద్దేశ్వర రావు, పైల అభిలాష్, సిహెచ్ఒ పద్మ, హెచ్ ఎస్ శ్రీను ఉన్నారు.

షాపును ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

'వైభవ్ జ్యూయలరీ' ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో మెయిన్‌రోడ్డులో గల వైభవ్ జ్యూయలరీని ఎస్‌పి మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైభవ్ సంస్థల సిఎండి భారతమల్లికా రత్నకుమారి గ్రంధి మాట్లాడుతూ రాష్ట్రంలో 19 బ్రాంచిలతో వైభవ్ జ్యూయలరీస్ నాణ్యమైన బంగారంలో షోరూంలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు సాలూరు పట్టణంలో 20వ షోరూం ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో సిఐఒ గొంట్ల రాఖాల్, సంస్థ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జె.రఘునాధ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరిక

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 6 పంచాయతీలకు కార్యదర్శులు బుధవారం చేరినట్లు ఎంపిడి బి.వెంకటరమణ తెలిపారు. హుస్సేన్ పురానికి కె.పోలీసశ్వరరావు, నీలానగరానికి పి.రాంబాబు, కంబరకు ఎల్.ప్రదీప్, ఆడారుకు ఎస్.రాజేశ్వరి, దశమంతపురానికి కె.దిలీప్, పివిఆర్ పురానికి పి.సురేష్ గ్రామపంచాయతీ కార్యదర్శులుగా చేరినట్టు తెలిపారు.

జనసేనలో ఎంపిటిసి సభ్యురాలు చేరిక

ప్రజాశక్తి పాలకొండ

మండలంలోని పలువురు వైసిపి నాయకులు జనసేనలోకి స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సమక్షంలో బుధవారం చేరారు. జనసేనలో చేరిన వారిలో జంపరకోట ఎంపీటీసీ నిమ్మక దుర్గమ్మ, నిమ్మక ప్రసాద్, ముటక చంద్రరావు, ఆరిక బాబూరావు ఉన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జనసేనలో చేరుతున్నట్లు ఎంపిటిసి దుర్గమ్మ తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ ఎంపిపి బొమ్మాలి భాను, వైస్ ఎంపిపి వాకుముడి అనిల్, ఎంపిటిసిలు మజ్జి నవీన్, జాడ శ్రీధర్, వేణువు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్ల మంజూరుకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పాచిపెంట

పేద మహిళలకు ప్రభుత్వం ఉచిత కుట్టుమిషన్ల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవచ్చునని స్థానిక ఎంపిడిఒ బివిజె పాత్రో ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అర్హులైన మహిళలు ఆంధ్రప్రదేశ్లో స్థిరవాసి ఉండాలని, సరైన ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు. అలాగే 18 నుంచి 50ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. సొంతంగా దరఖాస్తు చేసుకోవడానికి ఎటువంటి ఆప్షను ఉండదు గ్రామ సచివాలయంలోనే మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అంతా బినామీలే

- లక్షల్లో అద్దె బకాయిలు
- చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్న అధికారులు

మున్సిపల్ షాపింగ్ సముదాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయం పక్కనే గల మున్సిపల్ వాణిజ్య సముదాయంలోని దుకాణాలను వ్యాపారం కోసం లీజుకు తీసుకున్న వారిలో ఇద్దరు, ముగ్గురు తప్ప చాలా మంది వ్యాపారం చేయడం లేదు. అందులో ఎక్కువ మంది బినామీదారులే ఉండడం విశేషం. అయితే ఈ బినామీదారులు అద్దెలను మున్సిపాలిటీ నిర్దేశించిన అద్దెల కన్నా ఎక్కువ మొత్తంలో లీజుదారులకు చెల్లిస్తున్నారు. అయితే లీజుదారులు ప్రతి నెలా మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అద్దెలు చెల్లించకుండా లక్షల్లో బకాయిలు ఉండడం మరో విశేషం. దుకాణాల అద్దెలు లక్షల్లో పేరుకుపోతున్నప్పటికీ, మున్సిపల్ రెవెన్యూ అధికారులు అద్దెల వసూళ్లకు, బకాయి పడ్డ దుకాణాలపై చర్యలు తీసుకోకపోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మున్సిపాలిటీ ఆవిర్భావం నుంచి నెహ్రూ మార్కెట్ పేరుతో ఉన్న పాత సముదాయాన్ని తొలగించి, ఈ నూతన సముదాయాలను 2006లో అప్పటి పాలకవర్గం రూ.56లక్షల నిధులతో ఐడిఎస్‌ఎంటి సముదాయం 50 దుకాణాలను నిర్మించి అద్దెప్రాతి పదికన కేటాయించారు. ఈ సముదాయాల నుంచి ప్రతి నెలా అద్దె రూపంలో రూ.3లక్షల 50 వేలు చొప్పున ఏడాదికి రూ.36 లక్షల 60 వేలు మున్సిపల్ కార్యాలయానికి ఆదాయ రూపంలో వస్తోంది. పట్టణ. ప్రధాన రహదారి, పాత బస్టాండు, కూరగాయల మార్కెట్, చేపలు గొర్రెల దుకాణాలు, మున్సిపల్ కార్యాలయం, పక్క పక్కనే ఉండడంతో అప్పట్లో ప్రజా ప్రతినిధుల బంధువులు, వ్యాపార అనుభవం లేనివారు పోటీపడి దుకాణాలను దక్కించుకున్నారు. అయితే షాపులను దక్కించుకున్న వెంటనే వేరే బినామీ వ్యాపారాలకు ఎక్కువ అద్దె ప్రాతిపదికన ఇచ్చి లబ్ధి పొందుతున్నారు తప్ప మున్సిపల్ కార్యాలయానికి ప్రతి నెలా చెల్లించాల్సిన అద్దె చెల్లించకుండా లక్షల్లో బకాయి పడడం విశేషం. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, బకాయిలతో కలిపి ఇప్పటివరకు రూ.63 లక్షలు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటికీ రూ.35 లక్షలు మాత్రమే వసూళ్లు కావడం గమనార్హం. ఇంత పెద్ద మొత్తంలో అద్దె బకాయి ఉండడంపై మున్సిపల్ ఉన్నతాధికారులు మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారులపై ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. ఈ వాణిజ్యసముదాయంలో ఉన్న షాపులను లీజుకు తీసుకున్న వ్యాపారులు చెల్లించాల్సిన లక్షలాది రూపాయల అద్దెలు వసూళ్ల చేసే దిశగా మున్సిపల్ పాలకవర్గం, కమిషనర్, మున్సిపల్ రెవెన్యూ అధికారులు ప్రత్యేక దష్టిపెట్టేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యతగా ఎంతైనా ఉంది.

బాధ్యత అలవాటుగా మారాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్వచ్ఛ సుందర పార్వతీపురాన్ని ఆవిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను అలవాటుగా మార్చుకోవాలని కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా బుధవారం స్థానిక టిటిడి కల్యాణ మండపంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇఒపిఆర్‌డిలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురం ఆవిష్కరణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. జిల్లాలో గ్రీన్ అంబాసిడర్ల వ్యవస్థ ఉందని, తడి, పొడి చెత్త, గాజు, బ్లేడ్, అపాయకర వస్తువులు వేరుచేసేలా అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో మీ పంచాయతీ నెంబర్ వన్‌గా ఉండాలని కోరుకోవాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. ఇళ్ల నుంచి సేకరిస్తున్న పదార్థాలతో పాటు జిల్లాలో మంజూరు చేసిన గోకులాలు ఉన్నాయని, తద్వారా లభించే పేడ వంటి పదార్థాలను వినియోగించుకొని సేంద్రియ పదార్థాలను పెద్దఎత్తున ఉత్పత్తి చేయవచ్చని ఆయన అన్నారు. బహిరంగ మలవిసర్జన జరగరాదని ఆదేశించారు. జిల్లాలో 248 సామాజిక మరుగుదొడ్లు మంజూరు చేశామని, గతంలో 867 మంజూరయ్యాయని ఆయన వివరించారు. పారిశుధ్య నిర్వహణకు ఐదు వేల త్రిచక్ర సైకిల్ లను ఇవ్వడం జరుగుతోందని ఆయన చెప్పారు. పారిశుధ్య లోపం ఉంటే ఇ ఓ ఆర్ డి లపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున రావు మాట్లాడుతూ పారిశుధ్యంపై అవగాహన పెంచుకోవాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు కలిగి ఉండాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ కన్సల్టెంట్ శ్రీనివాసన్ చెత్త నుండి సంపద తయారు చేసే విధానం పై ఏర్పాటు చేసిన ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామ చంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిపిఒ టి.కొండలరావు, స్వచ్ఛ సుందర పార్వతీపురం ప్రతినిధి పద్మజ, ఘన, ద్రవ వనరుల నిర్వహణ కార్యకర్తలు, పాల్గొన్నారు.

వైద్యాధికారి కోసం చెట్టు కింద నిరీక్షిస్తున్న వికలాంగులు

వికలాంగులకు తప్పని నిరీక్షణ

ప్రజాశక్తి - కురుపాం

గత ప్రభుత్వ హయాంలో వికలాంగులు కోటాలో పింఛన్లు పొందుతున్న వారందరికీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సదరం క్యాంపు పెట్టి దానికి ఒక ప్రత్యేక వైద్యాధికారి నియమించి సచివాలయాలకు షెడ్యూల్ ఇచ్చి షెడ్యూల్ ప్రకారంగా సచివాలయ పరిధిలో ఉన్న వికలాంగుల అందరికీ సర్టిఫికేట్ల వెరిఫికేషన్ చేస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గల పలు గిరి శిఖర గ్రామాల నుంచి సదరం సర్టిఫిట్ వెరిఫికేషన్ కోసం బుధవారం ఉదయం 8 గంటలకే సిహెచ్‌సికి వచ్చినప్పటికీ సంబంధిత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వైద్య అధికారి 11 గంటలు సమయం అయిన రాకపోవడంతో వికలాంగులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసలే తాము వికలాంగులం తాము ఒక్కరుగా వచ్చి ఏ పని చేసుకోలేమని తమకు తోడుగా తమ కుటుంబ సభ్యులు ఒకరు, ఇద్దరు చొప్పున వచ్చారని వారికి కూడా తమతో పాటు నిరీక్షణ తప్పడం లేదని వాపోయారు. రోజంతా తమతో ఉండడం వల్ల వారు వేరే పనులకు వెళ్లలేక ఇక్కడ గంటలు తరబడి ఉండడం ఓ పక్క ఖర్చు పెరుగుతోందని మరోపక్క గంటల తరబడి ఉండలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి సకాలంలో వైద్యాధికారి వచ్చి సదరం సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయాలని కోరుతున్నామని అన్నారు.

పి4 సర్వే పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడగల్లు గ్రామంలో జరుగుతున్న పి-4 సర్వేను ఎంపిడిఒ టి.త్రివిక్రమ్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పీపుల్ సర్వేను ఇంటింటికి వెళ్లి పూర్తి చేయాలన్నారు. ఈ నెల 18లోగా గ్రామాలలో సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

ప్రజాశక్తి - కొమరాడ

నిర్ణీత గడువులోగా పిల్లలకు టీకాలు వేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని చంద్రంపేటలో టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకా కార్డులు, ఆర్సిహెచ్ రికార్డులు పరిశీలించి ఎంత మంది పిల్లలు, గర్భిణీలకు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. షెడ్యూల్ ప్రకారం వారి గడువు తేదీలు, ఏఏ వ్యాక్సిన్ వేశారో పరిశీలించారు. యువిన్ పోర్టల్ గమనించారు. పూర్తి చేసిన ప్రతి టీకా వివరాలు అదే రోజు ఆన్లైన్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల క్రమంలో చాలా వ్యాధుల నుంచి రక్షణ పొందడానికి టీకాలు సకాలంలో వేయడం ఆవస్యకమని పోలియో, క్షయ, హెపటైటిస్, న్యుమోనియా, తదితర సమస్యలు ప్రాణాంతక వ్యాధులకు గురికాకుండా కాపాడుకోవచ్చన్నారు. అనంతరం పిల్లల బరువు, ఎత్తు, కొలతల వివరాలపై అంగన్వాడీ సిబ్బంది ఆరా తీశారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో పిల్లలు, గర్భిణీల ఆరోగ్యంపై అధిక ఉష్ణోగ్రతల ప్రభావం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యాలయ డెమో వై.యోగీశ్వరరెడ్డి, వైద్య సిబ్బంది ప్రమీల, అనూష, అంగన్వాడీ సిబ్బంది అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మండలంలోని జమదాలలో అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు ఒక బాలికను గర్భవతిని చేసి తిరస్కరించడంతో అతనిపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సంతోషి కుమారి తెలిపారు. ఇద్దరూ మైనర్లు కావడంతో వివరాలు గోప్యంగా ఉంచడం జరిగిందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

కల్వర్టు నిర్మించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామం వద్ద గల గెడ్డపై కల్వర్టు నిర్మించాలని మండలంలోని చినగోరకాలనీ సచివాలయ పరిధి బట్టిగూడ గిరిజనులు కోరుతున్నారు. గాదిలంక నుంచి తమ గ్రామానికి రావాలంటే కల్వర్టు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గిరిజనులు కోరుతున్నారు. ప్రస్తుతం గెడ్డలో దిగి రాకపోకలు సాగిస్తున్నామని, వర్షాకాలంలో వరదలు ఎక్కువ కావడంతో గెడ్డ ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. ఇక్కడ కల్వర్టు పనులు పూర్తయితే గాదిలంక నుంచి తమ గ్రామం మీదగా సంత నర్సిపురానికి రాకపోకలు అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం కాకపోవడంతో కనీసం 108, 104, వాహనాలు వచ్చే దాఖలాల్లేవని చెబుతున్నారు. దీంతో రోగులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా తమ గ్రామాలకు రహదారి సౌకర్యంతో పాటు కల్వర్టు నిర్మించాలని, గిరిజనులు ముక్తకంఠతో కోరుతున్నారు.

స్త్రీనిధి ద్వారా రూ.ఐదు కోట్ల రుణాలు

ప్రజాశక్తి - సీతానగరం

డ్వాక్రా సంఘాలకు స్త్రీనిధి ద్వారా ఐదు కోట్ల రూపాయలు రుణాలను అందజేయడానికే లక్ష్యం పెట్టుకున్నామని వెలుగు ఎపిఎం ఆర్.శ్రీరాములనాయుడు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1000 మందికి 752 మందికి నాలుగు కోట్ల 52 లక్షలు స్త్రీ నిధి ద్వారా అందజేశామన్నారు. మండలంలో 1559 పొదుపు సంఘాలు ఉన్నాయని వీటిలో 913 పొదుపు సంఘాలకు రూ.47 కోట్లు రుణాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇప్పటివరకు 579 పొదుపు సంఘాలకు రూ.35.97 కోట్లు బ్యాంకు లింకేజ్ ద్వారా పొదుపు సంఘాలకు ఇచ్చామన్నారు. స్త్రీ నిధి ద్వారా రుణాల అందజేసిన వారి నుండి ఇప్పటి వరకు 96 శాతం రుణాలు కట్టించామని, మార్చి నెలకి 100 శాతాన్ని పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని అన్నారు. ఈ సమావేశంలో సీసీలు ఆనందరావు, ప్రసాదరావు, సంతోష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్ట్స్' ఆధ్వర్యాన మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాలను జియమ్మవలస మండలం టీకే జమ్ము గ్రామంలో బుధవారం నిర్వహించారు. సమాజంలో మహిళలకు ఉన్న ప్రాధాన్యత, గొప్పతనం, మహిళా రిజర్వేషన్లపై ఆర్ట్స్ సంస్థ సిబ్బంది రవిభట్ల వివరించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ స్థాయిలో ఉండి ప్రజలకు సేవలు అందిస్తున్న మహిళలకు, సచివాలయ సిబ్బందికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడ్డాకుల భారతి, ఆర్ట్స్ ఫీల్డ్ కో ఆర్డినేటర్ బి.సుగ్రీవులు, గిరిజన సహజ ఎఫ్ఇఒ చైర్మన్ కూరంగి కళావతి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అందుకు ఆర్ట్స్ చేయూత ఇవ్వడంలో ముందుంటుందని నాబార్డ్ డిడిఎం దినేష్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలో నౌగూడ ఆర్ట్స్ సంస్థ నిర్వహిస్తున్న మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా ఆదివాసీ మహిళా ఎఫ్‌పిఒ పనిచేస్తున్న సీతంపేట మండలంలోని నౌగుడా గ్రామంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ సంస్థ నాబార్డ్ సహకారంతో ఏర్పడిన మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ద్వార ఆదివాసీ ప్రాంతాలలో ఉత్పత్తుల కొనుగోలు, అమ్మకం, విలువ ఆధార శిక్షణ ఇచ్చి ఉత్పత్తులకు ఎక్కువ దార వచ్చేలాగ చేసి ఆదివాసీ రైతులను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేలాగా కృషి చేస్తున్నారన్నారు. మహిళలందరూ అన్ని రంగాలలో రాణించాలన్నారు.

సీతంపేట: మహిళను సన్మానిస్తున్న నాబార్డు డిడిఎం దినేష్‌కుమార్‌రెడ్డి

ఎంపిడిఒ కె.గీతాంజలి మాట్లాడుతు మహిళలు అన్ని రంగాలలో ముందుండి సమాజానికి ఒక ఉదాహరణగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎన్.లక్ష్మీనారాయణ, టి రాజశేఖర్, సీనియర్ సైంటిస్ట్, అనూష, ఎపిఎం పార్వతి, వాసన పాత్రో, ఎఫ్‌పిఒ సమన్వయకర్త ఎన్ అనూప్, సిఇఒ బి.శంకరరావు, వరహాలమ్మ, ఆదర్శంగా నిలిచిన మహిళలఎ నారీ శక్తి పురస్కారంతో సన్మానించి, కార్యక్రమానికి వచ్చిన మహిళకు ఆటలు ఆడించి బహుమతులు అందజేశారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వైసిపి 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగాయి. ఇందులో భాగంగా పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు పార్టీ జెండా ఆవిష్కరించి వైసీపీ శ్రేణులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ మాజీ ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి, మన్యం జిల్లా వివిధ మండలాలకు చెందిన వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిఎం పదవికి అనర్హుడని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని బోసు బొమ్మ జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ ఆవిర్భావం పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, ఎం.అప్పారావు, కొల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న రాజన్నదొర

స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి ఆర్ఐటిఐలో చదువుతున్న విద్యార్థులకు ఎల్విన్‌పేట ఎస్ఐ బిడ్డిక శివ ప్రసాద్ స్కిల్ డెవలప్మెంట్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా నేర్చుకొని పారిశ్రామిక శిక్షణలో నైపుణ్యం పొందాలని వివిధ కంపెనీలలో ఉద్యోగాల కల్పన సాధించుకోవాలని సూచించారు. నేటి కంప్యూటర్ యుగంలో పారిశ్రామిక శిక్షణక విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ సునీల్ కుమార్ ఉన్నారు.

అధిక ఆదాయం పొందేలా పంటల సాగు

ప్రజాశక్తి- గరుగుబిల్లి

రైతులు శాస్త్రవేత్తలుగా ఆలోచించి అధిక ఆదాయం పొందేలా పంటలు సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరావు తెలిపారు. మండలంలోని దళాయివలసలో మెంటర్స్, ఫార్మర్ సైంటిస్ట్‌ల శిక్షణ కార్యక్రమం బుధవారం జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా షణ్ముఖరాజు మాట్లాడుతూ మారుతున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను జోడించి, మేలు రకాల విత్తనాలు వేసేలా అధిక దిగుబడులు సాధించే ప్రకృతి వ్యవసాయ పద్దతులు పాటించడం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటలు పండించడం, నిరంతర ఆదాయం పొందేలా రైతులను కార్యకర్తలు సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, అందరూ కూడా రైతుల ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరగడానికి అవకాశం ఉన్న అన్ని కార్యక్రమాలు నిర్వహించేలా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ కో-డైరెక్టర్ ఎం.నూకంనాయుడు, ఎన్ఎఫ్ఎలు జి.అన్నపూర్ణ, తిరుపతిరావు, శారద, శ్రీను, ముసలయ్య, దేవీప్రసాద్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

అత్తెసరు నిధులు - అటకెక్కిన సంక్షేమం :కాంగ్రెస్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ స్వరూపం మేకపోతు గాంభీర్యంలా ఉందని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు అన్నారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్ అట్టాసంగా అంకెల సంఖ్యను బాహ్య ప్రపంచానికి ఎత్తిచూపుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047 లోని పది సూత్రాల సాధనకు ఈ 2025-26 బడ్జెట్ వారధిగా నిలుస్తుందని విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది కానుంది అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు పలుకుతునే ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమ పథకాలకు అత్తెసరు నిధులను కేటాయిస్తూ సంక్షేమాన్ని అటకెక్కించారని చిన్నారావు మండిపడ్డారు. నిరుపేదలు, నిరుద్యోగులు, రైతులు, మహిళలకు అందజేసే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగభృతి, కొత్త సామాజిక పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరు ప్రకటనలకే పరిమితం చేస్తూ రోజులు వెళ్లదీస్తున్నారని విమర్శించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ఉన్న ఆసుపత్రుల్లో కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ శ్యామలకు ఎపి మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్ల సమస్యలపై పలు దఫాలుగా వినతిపత్రాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని నేటి వరకు ఆ సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని అన్నారు. టివిటి గ్రూపు, స్కాట్లాండ్ సంస్థలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు అలజంగి కుమారమ్మ, రవి, కమల, ఎస్. శంకర్రావు, సుధీర్, రామారావు, త్రినాధ, అనూరాధ, వెంకటరమణ, రాజు, పార్వతీపురం జిల్లా ఆసుపత్రి, పాలకొండ, సీతంపేట ఏరియా ఆసుపత్రి శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డిప్యూటీ డిఇఒకు సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ డిప్యూటీ డిఇఒగా బాధ్యతలు చేపట్టిన టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జ్ఞానప్రకాష్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు ఆర్.దుర్గారావు మాట్లాడుతూ మంచి వ్యక్తి, స్నేహశీలి అయిన జ్ఞాన ప్రకాష్‌కు డిప్యూటీ డిఇఒకు ప్రమోషన్ రావడం పట్ల అభినందించారు. కోర్ కమిటీ చైర్మన్ పాలక దేవానంద్ మాట్లాడుతూ జ్ఞానప్రకాష్ విద్యాభివృద్ధికి పనిచేసి అందరి మన్ననలు అందుకోవడం, డిప్యూటీ డిఈఒగా ఉద్యోగోన్నతి పొందడం మంచి శుభ పరిమాణం అన్నారు. డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ తన సర్వీసును విద్యాభివృద్ధి కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల విశాఖపట్నంలో టిసిఆర్‌పిఎంల గిరిజన స్వాభిమాన వేడుకలు భాగంగా .12-, విశాఖపట్నంలో నిర్వహించిన పెయింటింగ్, ఆర్ట్ కంపిటేషన్ పోటీల్లో స్థానిక ఐటిడిఎ నుంచి పాల్గొన్న విద్యార్థులకు ప్రథమ, తృతీయ బహుమతులు సాధించారు. 6, 7 తరగతుల విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రథమ బహుమతి ఎస్.లావణ్య (ముత్యాల ఆశ్రమ పాఠశాల, ఆరో తరగతి విద్యార్థి)కి రూ.10వేలు నగదు అందజేశారు. సీతంపేట బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఎస్.నిర్మల తృతీయ బహుమతి కింద రూ. 5వేలు నగదు బహుమతి దక్కించుకుంది. వీరిని స్థానిక ఐటిడిఎ పిఒ.యశ్వంత్ కుమార్ రెడ్డి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐటిడిఎ సిఎంఒ చల్ల చిరంజీవులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.